డీజీపీగా ఎంఏ సలీం



బెంగళూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఎంఏ సలీంను రెగ్యులర్ పద్ధతిలో నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. మే 21న సలీం డీజీపీగా బాధ్యతలు తీసుకున్నారు. తాత్కాలిక డీజీపీగా కొనసాగుతున్న ఆయన్ని రెగ్యులర్ డీజీపీగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



వారి మాటే శాసనం

● స్థానికంలో అధికారులదే దర్బార్ ● జిల్లా, తాలూకా పంచాయతీలకు ముగిసిన గడువు ● ఏడేళ్లుగా బీబీఎంపీలో ఐఏఎస్‌లే.. ● కుంటుపడుతున్న పాలన

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా పాలకవర్గాలు అధికారంలో ఉంటే సమస్యలు పరిష్కారంతోపాటు స్థానికంగా ఎటువంటి అభివృద్ధి పనులు అత్యవసరం అనేది ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుంటుంది. తాగునీరు, మురుగు కాలువలు, విద్యాసంస్థలకు అవసరమైన పనులు చేపట్టవచ్చు. వీటన్నింటికంటే స్థానికంగా పాలకులు ఉంటే గ్రామాలు, తాలూకాల స్థాయిలో ఏటా జరిగే ఉత్సవాలు, జాతరలతోపాటు ఇతరత్రా కార్యక్రమాలపైనా పర్యవేక్షణ, బాధ్యతాయుతం ఉంటుంది. స్థానికంగా పాలకులు ఉంటేనే అభివృద్ధికి మార్గమనేది దశాబ్దాలకాలం కిందటే గుర్తించారు.

దేశం కోసం పోరాటం చేసిన మహాత్మాగాంధీ గ్రామస్వరాజ్‌ను ఆశించారు. పల్లె సీమలలో వార్డుసభ్యులు, సర్పంచ్‌లు ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయని ఏడున్నర దశాబ్దాలకిందటే భావించారు. అందుకే గ్రామపంచాయతీలకు జాతీయస్థాయిలో ప్రాధాన్యత ఇస్తూ వచ్చారు. గతంలో తాలూకా, జిల్లా పంచాయతీల ద్వారా గ్రాంట్లు విడుదల చేసేవారు. అందులో పక్షపాతం ఉంటుందని కేంద్రప్రభుత్వం కొన్ని ప్రత్యేక పథకాలకు నేరుగా గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేస్తున్నారు. ఈ ప్రక్రియ సజావుగా సాగాలంటే పాలకవర్గం ముఖ్యమనేది కేంద్రప్రభుత్వ ఆశయంగా ఉంది.

రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఎన్నికల పాలన సంపూర్ణంగా బంద్ అయ్యే పరిస్థితి ఏర్పడింది. పంచాయతీరాజ్ వ్యవస్థ ఆశయమే కనుమరుగయ్యే స్థాయికి చేరింది. ప్రస్తుత ఏడాది చివరినాటికి గ్రామపంచాయతీల పాలకవర్గాల అధికారం ముగియనుంది. తద్వారా రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ప్రజా ప్రతినిధులు లేని వ్యవస్థగా మిగిలిపోనుంది. డిసెంబరులోగా ఎన్నికలు జరపాలంటే కనీసం అక్టోబరు నాటికి గ్రామపంచాయతీల స్థాయిలో ఓటర్ల జాబితా సవరణ, రిజర్వేషన్లు, ఇటీవల కాలంలో చోటు చేసుకున్న మార్పులను పరిశీలించాల్సి ఉంటుంది. సెప్టెంబరు మాసం వస్తున్నా అటువంటి ప్రక్రియ చేపట్టలేదు. గడువులోగా ఎన్నికలు ముగిస్తారనేది ప్రశ్నార్థకం అవుతోంది. 2026 జనవరిలోగా 5958 గ్రామపంచాయతీలకు ఎన్నికలు ముగిసి కొత్త పాలకులు రావాలి. లేని పక్షంలో తాలూకా పంచాయతీలు, జిల్లా పంచాయతీలు, బీబీఎంపీ, నగరసంస్థల తరహాలోనే పంచాయతీలకు పాలకవర్గం లేకుండా పోతుంది. రాష్ట్రవ్యాప్తంగా 3903 తాలూకా పంచాయతీ సభ్యులు, 1083 జిల్లా పంచాయతీ సభ్యుల అధికార వ్యవధి 2021 మే 10నాటికి ముగిసింది. ఈ లెక్కన తాలూకా, జిల్లాపంచాయతీలకు పాలకవర్గాలకు నాలుగేళ్లు పూర్తయ్యింది.

● రాష్ట్రంలో జిల్లా పంచాయతీలు 31
● తాలూకా పంచాయతీలు 226
● గ్రామ పంచాయతీలు 5,958

బీబీఎంపీలోనూ అదే దుస్థితి

● బృహత్ బెంగళూరు మహానగర పాలికె ఎన్నికల విషయంలో జరిగినంత ఉదాసీనత బహుశా ఏ పాలకవర్గానికి జరగలేదని చెప్పవచ్చు. బీబీఎంపీలో పాలకవర్గం గడువు ముగిసి ఏడేళ్లు అవుతోంది. తొలుత అనుబంధ గ్రామాల విలీనం, నగర విస్తీర్ణం పెంపు, వార్డుల విభజన వంటి కారణాలతో ఐదేళ్లు ఎన్నికలు జరగలేదు. ఈ సమయంలో ఏడాదిన్నరపాటు ప్రభుత్వం సాగించిన కాంగ్రెస్ - జేడీఎస్ పార్టీ వార్డులను పెంచదలిచింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ వార్డుల సంఖ్యను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ వార్డుల సంఖ్యలో మార్పులు చేశారు. తాజాగా ఏడాది కాలంగా గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) చేయాలని కసరత్తు జరిపారు. ఇటీవలే గ్రేటర్ బెంగళూరు అథారిటీగా శాసనసభలోనూ ఆమోదం సాధ్యమైంది. సెప్టెంబరు 5 తర్వాత గ్రేటర్ బెంగళూరు అథారిటీ అధికారం చేపట్టే అవకాశాలు ఉన్నాయి. కానీ ప్రతిపక్షాలు వార్డుల విభజనతోపాటు బెంగళూరును ఐదు పాలికెలుగా చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీంతో పరిస్థితి ఏమవుతుందోనని అనిపిస్తోంది. ఈ ఏడాది ఆఖరు లేదా జనవరి ప్రారంభంలో గ్రేటర్ బెంగళూరు అథారిటీకి ఎన్నికలు జరుపుతామని డీకే శివకుమార్ పలు సందర్భాలలో ప్రకటించారు. పలు పాలికెలకు పాలకవర్గం ముగిసి ఏడాదిపైగా అయ్యింది.

ముగిసిన పాలకవర్గాల గడువు

జిల్లా, తాలూకా పంచాయతీలకు 2016 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. 2021 మే లో పాలకవర్గం గడువు ముగిసింది. గ్రామపంచాయతీలకు 2020 డిసెంబరులో ఎన్నికలు జరిగాయి. ఈ ఏడాది ఆఖరులో పాలకవర్గం గడువు ముగియనుంది. పంచాయతీరాజ్ వ్యవస్థ దారితప్పినట్టయ్యింది. పంచాయతీరాజ్ ఉద్దేశ్యం ప్రకారం పాలన వికేంద్రీకరణతోపాటు గ్రామాలలో స్వయం పాలన రావాలనేది ఆశయం. అయితే రాష్ట్రప్రభుత్వం పాలన వికేంద్రీకరణ అమలు చేయాలంటే సకాలంలో పాలకవర్గాలకు ఎన్నికలు జరపాలనే అంశానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. గత బీజేపీ ప్రభుత్వం జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీ ఎన్నికలు జరపలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండేళ్లు ముగిసినా కనీసం ఎన్నికలు జరపాలనే ఆలోచన కూడా చేయడం లేదు. గ్రామంనుంచి మహానగర పాలికె దాకా అధికారులదే రాజ్యంగా సాగుతోంది.

పోలీసుల సామాజిక బాధ్యతతోనే

శాంతిభద్రతలు

● సీఎం సిద్దరామయ్య ● రాష్ట్రపతి పతకాల ప్రదానం



బెంగళూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పోలీసులు సామాజిక బాధ్యతతో పనిచేస్తేనే శాంతిభద్రతలు సాధ్యమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. హోంశాఖలో విశిష్ట, ప్రముఖ సేవలందించిన వారికి రాజ్‌భవన్‌లో శనివారం రాష్ట్రపతి పతకాలను (ప్రెసిడెంట్ మెడల్స్) ప్రదానం చేశారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, హోంమంత్రి పరమేశ్వర్, డీజీపీ సలీంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో కుల వ్యవస్థతో ఎంతోమంది తారతమ్యాలను ఎదుర్కొంటున్నారని, వీటిని తీవ్రంగా పరిగణించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలోనూ డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (డీసీఆర్ఈ) పోలీస్‌స్టేషన్‌లను ప్రారంభించిందన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే దళితులపై దౌర్జన్యాలు రాష్ట్రంలో తక్కువన్నారు. ఉత్తమసేవకు రాష్ట్రపతి పురస్కారాలు దక్కడం సంతోషమన్నారు.



నగర పోలీస్ కమిషనర్‌కు మెడల్ అందజేస్తున్న గవర్నర్



రాజ్‌భవన్ గ్లాస్‌హౌస్‌లో హాజరైన పోలీసులు

తొలగించే ప్రయత్నం చేస్తే

రాజీనామాకు సిద్ధం

● పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి



బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్ సభాపతి హోదా నుంచి తొలగించే ప్రయత్నం చేస్తే ముందుగానే రాజీనామా చేస్తానని బసవరాజ హొరట్టి తెలిపారు. ఉత్తరకన్నడ జిల్లా శిరసిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడాది లేదా పదేళ్లు సభాపతిగా కొనసాగినా మాజీ అనేది ఖాయమన్నారు. గతంలో శంకరమూర్తి పార్టీ బలాబలాలకు అనుకూలంగా తప్పుకొన్నవారే అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నలుగురు సభ్యులను నామినేట్ చేయడంతో కాంగ్రెస్‌కు బలం పెరిగిందన్నారు. వారు సభాపతి హోదాకు ప్రయత్నం చేస్తే ముందుగానే రాజీనామా చేస్తానని తేల్చిచెప్పారు.

మాతృభాషలో చదువుతోనే మనుగడ

● త్రిభాషా విధానం అమలు చేయాలి
● తెలుగు భాషా దినోత్సవంలో తెవిస రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణరాజు

బెంగళూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మాతృభాషలో చదువుతో మనుగడ సాధ్యమని, ఆధునిక తెలుగుభాష సాహిత్యాల వైతాళికుడిగా గిడుగు రామమూర్తి పేరొందారని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు పేర్కొన్నారు. శనివారం శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలుచల్లి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణరాజు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో భాషకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అధికార భాష తెలుగును గ్రామస్థాయి నుంచి సచివాలయందాకా పరిపాలనలోనూ అమలు చేయాలన్నారు. మాతృభాషలో ప్రాథమిక విద్య అవసరమని ప్రధాని నరేంద్రమోదీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడులు పలు సందర్భాల్లో ప్రస్తావించారన్నారు. ఎన్టీరామారావు పాలనలో తెలుగులోనే పాలనా వ్యవహారాలు సాగాయన్నారు. ఇతర రాష్ట్రాలలో నివసించే తెలుగువారి అభ్యున్నతికోసం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. భాష, సాహిత్యం, సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. కర్ణాటకలో ద్విభాషాసూత్రం అమలు చేస్తే మైనారిటీగా ఉండే తెలుగుభాషకు అన్యాయం జరుగుతుందని, త్రిభాషాసూత్రాన్ని కొనసాగించాలని కోరారు. తమిళనాడులో తెలుగు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, అక్కడ తెలుగు మాట్లాడితే సామాజిక బహిష్కరణ ఎదుర్కొనేలాంటి ప్రమాదం ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతిని గౌరవంగా భావిస్తున్నామన్నారు. తెలుగు మహాసభలు నిర్వహించిన ఘనత ఆయనదే అన్నారు. కార్యక్రమంలో తెలుగు విజ్ఞాన సమితి ఉపాధ్యక్షుడు గంగరాజు, ఆదికేశవులు నాయుడు, కోశాధికారి వరదరాజు, కార్యవర్గ సభ్యులు నరసింహమూర్తి, వెంకటేశులు, ఉమాపతినాయుడు, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తెవిస అధ్యక్షుడు రాధాకృష్ణరాజు

మహా గణపయ్యా మళ్లీ రావయ్యా..!

● బెంగళూరులోని పలు ప్రాంతాల్లో ఘనంగా గణేశ్ నిమజ్జనం

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా నగర వ్యాప్తంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరు చోట్ల భారీ విగ్రహాలను కొలువుదీర్చారు. విశేషపూజల అనంతరం శనివారం నిమజ్జనం సాగింది. తొలిరోజున ప్రాంతాలవారీగా చిన్నవిగ్రహాలను తాత్కాలిక నిమజ్జనం కోసం ప్రత్యేక ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నగరంలోని హలసూరు, యడియూరు, సాంకి చెరువుతోపాటు పలు ప్రాంతాలలో నిమజ్జనానికి అవకాశం కల్పించారు. ఎక్కువసంఘాలు మూడు, ఐదు రోజులపాటు గణనాథుడి ఉత్సవాలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా మూడు రోజులు పూర్తైన సంఘాలవారు శనివారం ఊరేగింపు చేసి నిమజ్జన ప్రక్రియ కొనసాగించారు. భక్తులు గణపతి బప్పా మోరియా అంటూ విగ్రహాలను తీసుకొచ్చి చెరువుల్లో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బీబీఎంపీ సిబ్బంది, అధికారులు పర్యవేక్షించారు.



చెరువులో నిమజ్జనం



హలసూరు చెరువులో భారీ గణేశ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



ఇళ్లలోని విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు

ముగ్గురికి నాలుగేళ్ల జైలుశిక్ష

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ద్వితీయ పీయూసీకి చెందిన నకిలీ మార్క్సుకార్డులతో విలేజ్ అకౌంటెంట్ ఉద్యోగాలు పొందిన ముగ్గురు కటకటపాలైన ఘటన బాగలకోట జిల్లాలో చోటు చేసుకుంది. ప్రభుత్వాన్ని మోసం చేసి ఉద్యోగాలు సంపాదించిన ముగ్గురికి బాగల్‌కోట సీజేఎం కోర్టు న్యాయమూర్తి మహేష్ పాటిల్ నాలుగేళ్లపాటు జైలు శిక్ష, రూ 25వేల రూపాయలు జరిమాన విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. 2011 సంవత్సరంలో జరిగిన గ్రామ లెక్కాధికారి(వీఏఓ) పోస్టులకు సంబంధించి డైరెక్ట్ రిక్రూట్ మెంట్ కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. ఉద్యోగం పొందే ఉద్దేశంతో నకిలీ మార్కుల జాబితాను తయారు చేసి దరఖాస్తు చేసుకున్న నవ్యశ్రీ దేవారాజు, నటరాజు మునియప్ప, సుబ్రమణి ఎన్.సిలు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. అయితే విషయం తెలుసుకున్న అధికారులు ముగ్గురిపై నవనగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎన్నికైన అభ్యర్థులు తుమకూరు జిల్లా డీఎం పాళ్యకు చెందిన నవ్యశ్రీ, ముధోళ తాలూకాకుచెందిన జిరగాళ, జమఖండి గ్రామంలో వీఏవోగా ఎంపిక కాగా, చిక్కబళ్ళాపురలోని శాంతినగర్‌కు చెందిన నటరాజు జమఖండి తాలూకా హనగండి గ్రామంలో వీఏవోగా ఎంపిక కాగా, చిక్కబళ్ళాపుర జిల్లా నల్లేనహళ్ళికి చెందిన సుబ్రమణి బనహట్టి తాలూకాలో రబకవి-బనహట్టి గ్రామంలో వీఏఓగా విధులు నిర్వహించేవారు. ప్రభుత్వ తరుపున న్యాయవాది మహంతేష్ మసళి కేసును వాదించారు.



ఆసుపత్రిలో పాముతో డేవిడ్ మారన్

పట్టుబడిన 11 అడుగుల పాము

8

నేటి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు

● ఇప్పటికీ పొరుగు రాష్ట్రాల కంటే ధరలు తక్కువే : కమిషనర్ ముల్లై ముగిలన్



బళ్లారి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి. ఆగస్టు 31వ తేదీ నుంచి స్థిరాస్తి వ్యవహారాలపై దస్తావేజులపై విధిస్తున్న ఫీజు పెంచాలని ఆ శాఖ నిర్ణయించింది. పొరుగు రాష్ట్రాల కంటే ఫీజు తక్కువ ఉందని, దానిని ఇతర రాష్ట్రాలతో సమీకరణ చేసి కొత్తగా రిజిస్ట్రేషన్ ఫీజులను పెంచనున్నట్లు రిజిస్ట్రేషన్‌ల శాఖ కమిషనర్ ముల్లై ముగిలన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో కొత్త చార్జీలు 31 నుంచే అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 6.6శాతం ఫీజు విధిస్తుండగా తమిళనాడు రాష్ట్రంలో 9శాతం, కేరళ 10శాతం, ఆంధ్రప్రదేశ్ 7.5శాతం, తెలంగాణా రాష్ట్రంలో 7.5శాతం ఫీజు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. దస్తావేజులపై ముంద్రాక, రిజిస్ట్రేషన్ ఫీజులను పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగా ఉన్నందున, పరిపాలాత్మకమైన ప్రక్రియను బలపరిచే నేపథ్యంలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ధరలపై 1 నుంచి 2 శాతం పెరిగే అవకాశం ఉంది. సవరించిన ఫీజును సులభంగా అధికృత పోర్టల్ ద్వారా చెల్లించవచ్చు. ఇప్పటికే ఫీజులు చెల్లించి దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం అపాయింట్‌మెంట్ తీసుకున్న వారు వ్యత్యాసం మొత్తాన్ని అదే పోర్టల్ ద్వారా చెల్లించవచ్చు. ఈ విషయానికి సంబంధించి అర్జీదారులకు రిజిస్టర్డ్ మొబైల్ నెంబరుకు నేరుగా సందేశాన్ని పంపనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం రిజిస్ట్రేషన్‌కు శాఖకు చెందిన అధికృత పోర్టల్‌లో పొందుపరిచినట్లు కమిషనర్ ముల్లై ముగిలన్ తెలిపారు.



ఐదో రోడ్డులో రేణుకా యల్లమ్మ అలంకారంలో గణపతి



రెడ్డివీధిలో అష్టలక్ష్మి సమేత విఘ్ననాథుడు



సాయినగర్ రెండో క్రాస్‌లో కర్ణాటక కరప్షన్ అలంకారం




హరిహర దేవాలయం వద్ద కృష్ణావతార గణపతి



విద్యారణ్య నగర్‌లో ఎలుకపై బాల గణపతి విహారం



కోవూర్‌నగర్‌లో శివరుద్రరూప గణపతి



కమలానగర్‌లో జలకన్య అలంకారంలో



విభిన్ననాయకా.. నమోస్తుతే..!



మారుతీనగర్ మొదటిక్రాస్‌లో సుబ్రహ్మణ్యేశ్వర గణపతి

వినాయక చవితి వేడుకలు ఆఖరి ఘట్టానికి చేరువయ్యాయి. అనంతపురం నగరం సహా పలు ప్రాంతాల్లో ఆదివారం స్వామివారు గంగమ్మ ఒడిలోకి చేరనున్నారు. ఎప్పటిలాగే భిన్నమైన విగ్రహాలను కొలువుదీర్చేందుకు అనంత భక్తులు ఆసక్తి చూపించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ విగ్రహాల ఏర్పాటుకంటే.. ఆధ్యాత్మిక విశేషాలు, ఆధునికత ఉట్టిపడే విగ్రహాల ఏర్పాటుకే ప్రాధాన్యం ఇచ్చారు. ఇలాంటి విగ్రహాలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఎక్కడెక్కడ ఎలాంటి విగ్రహాలను ఏర్పాటు చేశారో తెలుసుకుని, అక్కడికి వెళ్లి తిలకించారు. - **ఆంధ్రజ్యోతి, అనంతపురం**

ముగిసిన వెరిఫికేషన్

డీఎస్సీ-2025 సర్టిఫికెట్ల పరిశీలన దాదాపు పూర్తి

విడుదల కాని మరో 50మంది అభ్యర్థుల జాబితా

అనంతపురం విద్య, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ- 2025 నియామకాల ప్రక్రియలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. రాష్ట్రశాఖ ఇప్పటివరకు రెండువిడతలలో ఎంపిక అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. సెలెక్ట్ జాబితాలో ఉన్న అభ్యర్థులకు నేరుగా రాష్ట్రశాఖ నుంచే కాల్‌లెటర్స్(మెసేజ్‌లు) పంపారు. మొత్తం 757 మందికి పంపగా, ఆ మెసేజ్‌లు వచ్చిన అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. నగర శివారు పీవీకేకే కళాశాలలో ఈ పరిశీలన ప్రక్రియ ఈనెల 28నుంచి కొనసాగించారు జిల్లా పరిశీలకులు జాయింట్ డైరెక్టరు సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో 19కమిటీలు ఏర్పాటు చేసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. ఈ ప్రక్రియ శుక్రవారమే ముగియాల్సి ఉన్నా 9మంది గైర్హాజరుకావడంతో వారికి శనివారం వరకు అవకాశం కల్పించారు. దీంతో ఇందులో ఉన్న ఆరుగురు అభ్యర్థులు శనివారం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. దీంతో తొలివిడత వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసింది.

● ఇద్దరి ఎంపిక తిరస్కరణ, మరొకరికి రేపటి వరకు గడువు

రాష్ట్రశాఖ 757 మందితో సెలెక్ట్ జాబితాను జిల్లాకు పంపింది. ఇందులో మూడు రోజులు జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనకు 754 మంది హాజర య్యారని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. సెలెక్ట్ జాబితాలో ఉన్న ఇద్దరి ఎంపికను జిల్లా విద్యాశాఖ అధికారులు, కమిటీ సభ్యులు తిరస్కరించారు. చంద్రమౌళి అనేఅభ్యర్థి పీహెచ్‌కింద ఎంపిక జాబితాలో పేరు వచ్చింది. అయితే పరిశీలనకు ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకు రాకపోవడంతో పరిశీలన కమిటీ అభ్యంతరం చెప్పింది. విషయం డీఈఓ ప్రసాద్ బాబు దృష్టికి రావడంతో ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకువస్తేనే ఆమోదం పొందుతుందని చెప్పి పంపారు.. ఆయన తిరిగి పరిశీలనకు రాకపోవడంతో ఎంపిక అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు. మరో అభ్యర్థి వెంకటరమణ ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఎంపికఅయ్యారు. నిబంధనల మేరకు ఆయన సర్టిఫికెట్లు చూపించకపోవడంతో తిరస్కరించినట్లు డీఈఓ తెలిపారు. శ్రీనివాసులు అనే అభ్యర్థి పీహెచ్ కోటాలోనే ఎంపికకాగా, ఒరిజనల్ సర్టిఫికెట్లకు సంబంధిత ఆస్పత్రినుంచి రాలేదని చెప్పడంతో ఆయనకు సోమవారం వరకు అవకాశం ఇచ్చారు.

● మరో జాబితా కోసం నిరీక్షణ

జిల్లాలో 807 టీచర్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల కావాల్సి ఉంది. అయితే ఇప్పటికి 757మందిజాబితా మాత్రమే రావడం జరిగింది. ఇంకా 50మంది అభ్యర్థుల సెలెక్ట్ జాబితా రావాల్సి ఉంది. శనివారం కూడా విడుదల కాలేదు. సోమవారం ఈజాబితా వచ్చే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ యంత్రాంగం చెబుతోంది.



డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

పల్లె ఉమాకు ఘన నివాళి

కుటుంబ సభ్యులతో పాటు వివిధ పార్టీల నాయకుల శ్రద్ధాంజలి

అనంతపురం రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమాకు కుటుంబ సభ్యులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. మండలంలోని కక్కలపల్లి సమీపంలోని పల్లె వ్యవసాయ క్షేత్రంలో పల్లె ఉమా ఘాట్ వద్ద శనివారం ఏడో వర్ధంతి నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, మనవడు, మనవరాలు వియాన్, వన్షా, వియ్యంకులు కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, ఆయన సతీమణి సౌభాగ్యరాణి, పీవీకేకే యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి తదితర కుటుంబ సభ్యులు ముందుగా పల్లె ఉమా ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. వీరితోపాటు ఉమ్మడి జిల్లాలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బాలాజీ విద్యాసంస్థల ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున నివాళులు అర్పించారు. పుట్టపర్తి నుంచి పల్లె ఉమా ఘాట్ వరకు టీడీపీ యువ నాయకులు రామ్‌లక్ష్మణ్ ఆధ్వర్యంలో 300మంది యువకులతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం పల్లె ఉమాకు నివాళులు అర్పించారు. దీంతో వ్యవసాయ క్షేత్రం జనసంద్రంగా మారింది.



నివాళులు అర్పిస్తున్న పల్లె రఘునాథరెడ్డి, ఎంపీ బీకే, ఎమ్మెల్యేలు అమిలినేని, పల్లె సింధూర, పల్లె కిశోర్, టీడీపీ నాయకులు

ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రతిపక్షపార్టీ నేతలు హాజరు

పల్లె ఉమాకు ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్ర బాబు, ఎమ్మెస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి నివాళులు అర్పించారు. వీరితోపాటు ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్, నగర మాజీ మేయర్ స్వరూప, డిప్యూటీ మేయర్ గంపన్న, సీపీఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, వేమయ్య యాదవ్, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, జాఫర్, కేశవరెడ్డి, శ్రీరాములు, సీపీఎం రాష్ట్ర నాయకులు రాంభూపాల్, పెద్దిరెడ్డి, నాగేంద్ర, ప్రముఖ వైద్యులు సుధీంద్ర, రామ్మోహన్, రాంప్రసాద్, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు నివాళులు అర్పించారు.



పల్లె ఉమా ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కుటుంబ సభ్యులు

మెగా రక్తదాన శిబిరం

పల్లె ఉమా వర్ధంతిని పురస్కరించుకుని వ్యవసాయ క్షేత్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పుట్టపర్తి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యాసంస్థల ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. పల్లె ఉమా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలోని సిబ్బంది, కార్మికులకు వస్త్రదానం చేశారు. విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు సుబ్బారావు, మన్మథేశ్వర్‌రెడ్డి, సంతోష్‌కుమార్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రమేష్‌బాబు, శర్మ, రాఘవేంద్ర, ప్రకాష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి



పరిటాలరవి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ తదితరులు

రామగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దివంగత పరిటాల రవీంద్ర 67వ జయంతి వేడుకలు మండలంలోని వెంకటాపురంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో కుమారులు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ, కోడళ్లు పరిటాల జ్ఞాన, పరిటాల తేజశ్వినిలతో పాటు ఇతర కుటుంబ సభ్యులు పరిటాల రవీంద్ర ఘాట్‌కు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమీప గ్రామాల నుంచి తరలివచ్చిన అభిమానులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించిన అనంతరం ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అన్నదాన చేశారు. మండలంలో కూడా పలు చోట్ల పరిటాల రవీంద్రజయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రామగిరి టీడీపీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

తూతూమంత్రంగా..!

● రోడ్డు పనుల్లో నాణ్యత డొల్ల ● నెల రోజులకే ధ్వంసమైన రహదారులు



ఉండబండ దేవాలయం వద్ద పగిలి పోయిన రోడ్డు

విడపనకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో పనులు నాణ్యతగా చేయకపోవడంతో రోజుల వ్యవధిలోనే రోడ్లు పాడైపోతున్నాయి. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. మండలంలోని ఉరవ కొండ నుంచి ఉండబండ మీదుగా పాల్తూరు గ్రామం వెళ్లేందుకు దాదాపుగా 14 కిలో మీటర్లు తారురోడ్డు నిర్మాణానికి రూ. 2.5 కోట్ల నిధులు కేటాయించారు. ఈ రోడ్డు పనులను జూలైలో ప్రారంభించి ఆగస్టులో పూర్తి చేశారు. అయితే రోడ్డు మాత్రం అప్పుడే ఎక్కడ పడితే అక్కడ పగిలిపోయింది. అలాగే ఉరవకొండ-బళ్లారి 42వ జాతీయ రహదారి వద్ద నుంచి పాల్తూరుకు వెళ్లే రోడ్డు పనులు రెండు కిలోమీటర్లు చేశారు. మధ్యలో రెండు కిలోమీటర్లు వైసీపీ ప్రభుత్వంలో చేయటంతో వాటిని వదిలేసి ఉండబండ ఆలయం వరకూ దాదాపుగా ఆరు కిలో మీటర్లు తారు రోడ్డు పనులు చేశారు. మధ్యలో అక్కడక్కడ ధ్వంసమైన పాత రోడ్డును తొలగించి పాల్తూరు నుంచి పనులు చేపట్టారు. ఉరవకొండ నుంచి ఉండబండ వరకూ తారు రోడ్డు పనులు పూర్తి చేశారు. తిరిగి పాల్తూరు నుంచి ఉండబండ వరకూ ఎదురు రోడ్డు వేసుకుంటూ వస్తున్నారు. ఇటు వైపు వేసిన రోడ్డు అప్పుడే శిథిలమై పాత రోడ్డును తలిపిస్తోంది. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే పనుల్లో నాణ్యత లోపిస్తోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఎఈ నాగభూషణంను వివరణ కోరగా రోడ్డు వేసిన వెంటనే 15 రోజులు వర్షాలు రావటంతో పగిలిందని అన్నారు. దీనికి తోడు పెద్ద పెద్ద వాహనాలు రోడ్డుపై వెళ్తూ ఉండటం కూడా ధ్వంసమవడానికి కారణమన్నారు. పాల్తూరు నుంచి రోడ్డు వేస్తూ వస్తున్నారు. దీనిపై మళ్లీ రోడ్డు వేయిస్తామని తెలిపారు.



మారెమ్మ గుడి నుంచి వంద మీటర్లకు పైగా ఇలా పగిలిపోయింది..



ర్యాలీగా వస్తున్న మంత్రి సవిత, పరిటాల కుటుంబం, ఎమ్మెల్యేలు



అభివాదం చేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్, సిద్ధార్థ

పేదల గుండె ధైర్యం పరిటాల

పెనుకొండ టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పరిటాల అంటే పేరు కాదని, పేద ప్రజల గుండె ధైర్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండ దర్గా సర్కిల్‌లో తను స్వయంగా ఏర్పాటు చేయించిన మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాన్ని ఆమె శనివారం ఆవిష్కరించారు. అంతకు మునుపు పరిటాల కుటుంబ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. అరాచకాలు, దాడులను ఎదుర్కొనడానికే పరిటాల రవీంద్ర జీవితం మొత్తం సరిపోయిందని అన్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తనను రాజకీయాలలోకి రావాలని ఆహ్వానించారని, కానీ తన తండ్రి అంగీకరించలేదని అన్నారు. ఆయన కల ఇప్పుడు నెరవేరిందని, తాను రాజకీయాల్లోకి వచ్చి మంత్రిని అయ్యానని అన్నారు. పరిటాల రవీంద్ర మహిళలకు అండగా పెద్దన్నయ్యలా ఉండేవారని, అప్పట్లో తాగునీటి కోసం పరగోడు ప్రాజెక్టు వద్ద యుద్ధం చేశారని అన్నారు. వెనుకబడిన అనంతపురం జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేశారని అన్నారు.

రవి రాకతో ప్రజల్లో ధైర్యం: ఎంపీ బీకే పార్థసారథి

అనంతపురం జిల్లాలో 1993లో అరాచకాలు ఎక్కువగా ఉండేవి. పెనుకొండలో పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాని సమయంలో ఎన్టీఆర్ పరిటాల రవీంద్రను తీసుకొచ్చారు. ఆయన రాకతో ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చారు. ఆయనకు అండగా నిలిచి ఎన్నికల్లో గెలిపించారు. బడుగు బలహీనవర్గాలు రాజకీయంగా ఎదగడానికి ఆయన ఎంతో కృషి చేశారు. అందులో నేనూ ఒకడిని.

కల నెరవేరింది: ఎమ్మెల్యే పరిటాల సునీత

నందమూరి తారక రామారావు ఆశయాలతో జిల్లాలో పెత్తందారులను తొక్కడానికి వచ్చిన నాయకుడు పరిటాల రవీంద్ర. నా భర్త మరణానంతరం నాకు రాజకీయం నేర్పించిన దేవుళ్లు పెనుకొండ ప్రజలు. పరిటాల కుటుంబం ఉన్నంతవరకు ఈ నియోజకవర్గ ప్రజలను మరిచిపోము. సీనియర్ నాయకుల అండతో అన్ని రకాలుగా అభివృద్ధి చేశాను. మాకు రాజకీయ భిక్ష పెట్టింది మొదట ఎన్టీఆర్, ఆ తరువాత పెనుకొండ ప్రజలు. పరిటాల రవి ఎనిమిది అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేసిన మంత్రి సవితకు మా కుటుంబం అండగా ఉంటుంది. ఇక్కడ పరిటాల రవీంద్ర విగ్రహం ఉండాలన్నది నా చిరకాల కోరిక. నేడు నెరవేరింది.

ప్రత్యర్థుల గుండెల్లో సింహస్వప్నం

ప్రత్యర్థుల గుండెల్లో పరిటాల రవీంద్ర సింహస్వప్నం. పేదలకు, అభాగ్యులకు, బాధితులకు అండగా ఉన్న నాయకుడు ఆయన. రాజకీయ చరిత్రలో తిరుగులేని నాయకుడు. ఈ జిల్లాలో ఎందరో మంత్రులు, ఎమ్మెల్యేలు అయి ఉంటారు. కానీ పరిటాల రవి రాసిన చరిత్రను మార్చలేరు. కొంతమంది కుటుంబం కోసం పుడతారు. కొంతమంది ప్రజల కోసం పుడతారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేవారు అతికొద్ది మంది ఉంటారు. వారిలో పరిటాల రవీంద్ర ఒకరు.

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

గర్వకారణం

పేద, బడుగు, బలహీనవర్గాల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి పరిటాల రవీంద్ర. కరువు జిల్లా అనంతలో ఆయన పుట్టడం జిల్లాకు గర్వకారణం. తెలుగుదేశం పార్టీలో పరిటాల రవి ఉండటం గర్వకారణమని అప్పట్లో ఎన్టీఆర్ అన్నారు. మంత్రి సవిత పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం.

- జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట ఆంజనేయులు

మీ రుణం తీర్చుకోలేం: పరిటాల శ్రీరామ్

పరిటాల కుటుంబం రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే పెనుకొండ ప్రజలు అన్నివిధాలుగా అండగా నిలిచారు. మా విజయానికి, రాజకీయంగా నిలదొక్కుకునేందుకు కృషి చేశారు. పెనుకొండ ప్రజల రుణం తీర్చుకోలేనిది. పెనుకొండ అంటేనే పరిటాల అని ఎక్కడికెళ్లినా గుర్తు చేస్తారు. పెనుకొండ ప్రజల త్యాగాలు, వారి భిక్షతోనే ఈ రోజు రాజకీయాలు చేయగలుగుతున్నాం. మా తల్లి నామినేషన్‌ను మరిచిపోలేము. మృతదేహాలపై నడిచివెళ్లి నామినేషన్ వేశాము. అలాంటి సమయంలో కూడా మాకు అండగా నిలబడ్డారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

ఆదిభట్ల నారాయణదాసు (జయంతి)



హరికథా పితామహగా పేరొందిన అజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసు 1864 ఆగస్టు 31న విజయనగరం జిల్లా అజ్జాడ గ్రామంలో జన్మించారు. కళాకారుడు, సంగీతం, సాహిత్యం, నృత్యాల మేళవింపుతో హరికథ ప్రక్రియలో సరికొత్త ఒరవడి తెచ్చారు. తెలుగు, సంస్కృతాలలో శతాధిక రచనలు చేశారు. కవి, బహుభాషా కోవిదుడు, తాత్వికుడు. తెలుగు, సంస్కృతం, తమిళం, హిందీ, ఉర్దూ, ఆంగ్లం, అరబ్బీ, పార్శీ భాషలలో ప్రావీణ్యం పొంది అష్టావధానాలు చేశారు. 1945 జనవరి 2న కన్నుమూశారు.

మరియ మాంటిస్సోరి (జయంతి)



ఇటలీ దేశానికి చెందిన డాక్టర్, విద్యావేత్త మరియ టెక్లా అర్టెమిసియా మాంటిస్సోరి 1870 ఆగస్టు 31న జన్మించారు. చిన్నారులకు 'ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్‌'లో ఆమె ప్రతిపాదించిన అంశాలు ఎంతో పేరొందాయి. మాంటిస్సోరి మెథడ్‌గా పేరొంది 20 భాషలలో అనువాదమయ్యాయి. నేటికీ ప్రపంచవ్యాప్తంగా ఆమె విధానాలలో పాఠాలు కొనసాగుతున్నాయి. 1949, 50, 51లలో వరుసగా నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ అయ్యారు. 1952 మే 6న కన్నుమూశారు. ఆమె జ్ఞాపకార్థం భారత్ సహా పలుదేశాలలో పోస్టల్ స్టాంపులు విడుదలయ్యాయి.

ఆరుద్ర (జయంతి)



ప్రముఖ రచయిత ఆరుద్ర 1925 ఆగస్టు 31న విశాఖపట్నంలో జన్మించారు. అసలు పేరు భాగవతుల సదాశివ శంకరశాస్త్రి. తెలుగు సాహిత్యంలో అపారమైన పట్టు కలిగి రచయితగా, కవిగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, అనువాదకులుగా, పబ్లిషర్‌గా రాణించారు. శ్రీశ్రీగారి మేనల్లుడైనా సొంత ప్రతిభతో రాణించారు. 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' రచన తెలుగు సాహిత్యంపై అధ్యయనం చేసేవారికి గొప్ప గ్రంథం. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) వ్యవస్థాపకుల్లో ఒకరు. సుమారు 4వేల సినిమా పాటలు రాశారు. టాలీవుడ్‌లో ఎన్నో కథలు, పాటలు రాశారు. సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. 1998 జూన్ 4న కన్నుమూశారు.

తురగా జానకీరాణి (జయంతి)



'రేడియో అక్కయ్య'గా గుర్తింపు పొందిన తురగా జానకీరాణి 1936 ఆగస్టు 31న కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జన్మించారు. ఆలిండియా రేడియోలో రెండు దశాబ్దాలకుపైగా వ్యాఖ్యాతగా వ్యవహరించారు. చిన్నపిల్లల కథలు, మూడు నవలలు, ఐదు పుస్తకాలు, రేడియో నాటికలు రచించారు. ఆకాశవాణి జాతీయ పురస్కారాన్ని నాలుగుసార్లు అందుకున్నారు. నిశ్శబ్దంలో ప్రేమనాదాలు, ఆశ్చర్యం డాక్యుమెంటరీలు, పిల్లలచే కోరస్ పాటలు పాడించి ప్రత్యేక గుర్తింపు పొందారు. దూరదర్శన్‌లో భరతనాట్య ప్రదర్శనలు ఇచ్చారు. 2014 అక్టోబరు 15న కన్నుమూశారు.

బాపు (వర్ధంతి)



అందాల భామను వర్ణించడానికి బాపు బొమ్మగా పిలుస్తుంటారు. అంతగా తెలుగువారి సంస్కృతిలో బాపు బొమ్మ, రాత భాగమయ్యాయి. ఆయన అసలు పేరు సత్తిరాజు వెంకట లక్ష్మీనారాయణ. 1933 డిసెంబరు 15న పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం కంతేరు గ్రామంలో జన్మించారు. సినీ దర్శకుడిగా, చిత్రకారుడిగా, కార్టూనిస్ట్‌గా, స్క్రీన్‌రైటర్‌గా బహుముఖ ప్రజ్ఞతో రాణించారు. ఆయన వేసిన కార్టూన్‌లు, పుస్తకాల ముఖచిత్రాలకు లెక్కలేదు. తెలుగు సినీరంగంతోపాటు బాలీవుడ్‌లోనూ గుర్తింపు పొందారు. బాపు, ముళ్ళపూడి రమణల ద్వయంలో ఎన్నో సినిమాలు వచ్చాయి. రెండు జాతీయ పురస్కారాలు, ఏడు నంది అవార్డులు, జీవిత సాఫల్య పురస్కారాలు, పద్మశ్రీ, కళాప్రపూర్ణ పురస్కారాలు అందుకున్నారు. 2014 ఆగస్టు 31న కన్నుమూశారు.

ప్రణబ్ ముఖర్జీ (వర్ధంతి)



'భారతరత్న' గ్రహీత ప్రణబ్ ముఖర్జీ 1935 డిసెంబరు 11న పశ్చిమబెంగాల్‌లో జన్మించారు. 13వ రాష్ట్రపతిగా 2012 నుంచి 2017 వరకు వ్యవహరించారు. కాంగ్రెస్‌లో ఐదు దశాబ్దాలపాటు విభిన్న హోదాలలో కొనసాగారు. కేంద్ర మంత్రిగా వివిధ శాఖలను పర్యవేక్షించారు. ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారు. రచనపై ఆసక్తితో కొన్ని పుస్తకాలు రాశారు. పద్మ విభూషణ్, పలు విదేశీ ఇతర గౌరవాలు అందుకున్నారు. 2020 ఆగస్టు 31న కన్నుమూశారు.

ప్రిన్సెస్ డయానా (వర్ధంతి)



ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్‌గా గుర్తింపు పొంది బ్రిటీష్ రాజవంశానికి చెందిన ప్రిన్స్ చార్లెస్ మొదటి భార్య డయానా ఫ్రాన్సిస్ స్పెన్సర్ 1961 జూలై 1న జన్మించారు. బ్రిటీష్ మహారాణి ఎలిజబెత్ -2 కోడలు. ఈవిడ ప్రిన్స్ విలియం (డ్యూక్ ఆఫ్ కేంబ్రిడ్జ్), ప్రిన్స్ హ్యారిలకు తల్లి. ఎయిడ్స్ రోగుల చైతన్యం కోసం కృషి చేశారు. 1997 ఆగస్టు 31న పారిస్‌లో ఒక కారుప్రమాదంలో మరణించారు.

జవగళ్ శ్రీనాథ్ (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ జవగళ్ శ్రీనాథ్ హాసన్ జిల్లా అరసికెరె తాలూకా జవగళ్ ప్రాంతంలో 1969 ఆగస్టు 31న జన్మించారు. ప్రస్తుతం కామెంటేటర్‌గా, ఐసీసీ మ్యాచ్ రెఫరీగా వ్యవహరిస్తున్నారు. 1999లో అర్జున అవార్డు పొందారు. రిటైర్మెంటైనా యువ క్రికెటర్‌లను ప్రోత్సహిస్తున్నారు.

పశువులకు బీమా చేయించుకోండి

▸▸ కోచిముల్ క్యాంప్ అధికారి డాక్టర్ రవికిరణ్



దేవరమళ్ళూరు పాలసంఘం వార్షిక సభ

శిడ్లఘట్ట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పశువులకు తప్పనిసరిగా బీమా చేయించుకోవడం ద్వారా అనుకోకుండా మృతి చెందితే ఆర్థికభారం నుంచి ఉపశమనం సాధ్యమవుతుందని కోచిముల్ క్యాంప్ డిప్యూటి మేనేజర్ డాక్టర్ రవికిరణ్ సూచించారు. తాలూకాలోని దేవరమళ్ళూరు పాల డెయిరీ ఉత్పత్తిదారుల సంఘం వార్షిక మహాసభలో పాల్గొని మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7 లక్షల రూపాయల నికరలాభం సాధించిదన్నారు. ఎంతోమంది రైతులు విలువైన ఉత్తమరకం సీమ ఆవులను పెంచుతున్నారని, అయితే చాలామంది వాటికి బీమా చేయించక నష్టపోతున్నారన్నారు. ఈ అంశంపై పాడిరైతులలో అవగాహన పెరగాలన్నారు. బీమా ప్రీమియంలో సగం సహకార సంఘం భరించనుందని, మిగిలిన సగం రైతు భరిస్తే చాలన్నారు. వర్షాకాలంలో పాలిచ్చే ఆవులకు పచ్చగడ్డితోపాటు ఎండుగడ్డి కూడా దాణాగా ఇవ్వడం ద్వారా పాల నాణ్యత, దిగుబడి పెరుగుతుందన్నారు. కోచిముల్ క్యాంప్ కార్యాలయ విస్తరణాధికారి బీ శ్రీనివాస్ 2024-25 వార్షిక జమాఖర్చును సభకు వివరించారు. పాల సహకారసంఘం అధ్యక్షుడు ఎం దేవరాజ్ అధ్యక్షత వహించారు. పాల దిగుబడిలో ప్రగతి సాధించిన ఆంజినప్ప, బైరమ్మ, కేశవలతోపాటు పాడిరైతుల పిల్లలు ఏడో తరగతి తేజస్విని, ఎస్ఎస్ఎల్‌సీ నిఖిల్‌గౌడ, ద్వితీయ పీయూ స్ఫూర్తి, ఎంబీబీఎస్ చదువుతున్న జే నయనలకు ప్రోత్సాహకాలు అందచేసి అభినందించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఎం కేశవరెడ్డి, డైరెక్టర్ డీఎన్ కృష్ణప్ప, బీఎల్ నంజుండప్ప, ఎం ఆనందప్ప, అశోక్‌కుమార్, కే మునిరెడ్డి, శివకుమార్, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

వృత్తిని గౌరవంగా భావించాలి



పురస్కారాలు పొందిన పలు సంస్థల ప్రతినిధులు

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వృత్తిని గౌరవంగా భావించాలని పలువురు ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. అవతార్ గ్రూప్, ఈవైజీడీఎస్ మ్యాక్ సంస్థలు సంయుక్తంగా మేం ఎందుకు పనిచేయాలి అనే అంశంపై పరిశోధన చేశాయి. ఏప్రిల్ నుంచి జులై దాకా దేశవ్యాప్తంగా వయసు, స్త్రీ పురుషలతో వేర్వేరు అంశాలపై సర్వే చేసినట్టు అవతార్ గ్రూప్ ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ సౌందర్య రాజేశ్ అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా జరిపిన సర్వేలో కేవలం జీతం కోసం మాత్రమే పనిచేయడం లేదని పలువురు అభిప్రాయపడ్డారన్నారు. గుర్తింపు, గౌరవం, ఒక ఉద్దేశ్యం కోసం పనిచేస్తున్నట్టు అభిప్రాయపడ్డారన్నారు. స్త్రీ పురుషులలో దాదాపు సమానంగా పనిచేసినా కొన్ని చోట్ల మహిళలు వృత్తి నిర్వహణలోనే ప్రమాదాలకు గురవుతున్నట్టు తెలిసిందన్నారు. ఏఐ, హైబ్రిడ్ టెక్నాలజీ, ఆర్థిక మార్పులు కూడా వృత్తి జీవనంపై ప్రభావం చూపుతున్నట్టు గుర్తించామన్నారు. అవతార్ గ్రూప్‌తో కలసి పనిచేసేందుకు ఈవైజీడీఎస్ ముందుకు రావడాన్ని సంతోషంగా ప్రకటించారు. ఈవైజీడీఎస్ హెచ్ఆర్ జయావీర్వాణి అభిప్రాయం ప్రకారం వృత్తి జీవనంలో ప్రతిభను చాటేందుకు ఒక వేదికగా పలువురు పలువురు అభిప్రాయపడ్డారన్నారు. ఈవైజీడీఎస్‌కు చెందిన లూయిస్‌మాథ్యూ పలువురికి పురస్కారం ప్రదానం చేశారు. కేవీఆర్ ఎనర్జీ ఇండియా ఎండీ గీతారామమూర్తి, కెరీర్ ఐకాన్స్ పురస్కారాన్ని మైక్రోసాఫ్ట్ ఇండియా శిల్పమిత్ర, సేల్స్‌ఫోర్స్ ఇండియా సీనియర్ మేనేజర్ శోభిత నీలనాథ్, ఇన్‌స్పైరింగ్ సెకండ్ కెరీర్ ప్రొఫెషన్స్ పురస్కారాన్ని, జుసీ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ముఖ్యులు ప్రీతి సెంథిల్‌కుమార్‌కు, బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ పవిత్రశంకర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

కలల సాకారానికి కృషి చేయండి



పట్టాలు పొందిన విద్యార్థులు

విజయపుర, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేషన్ డే అనేది విద్యార్థి పరిపక్వతకు గుర్తింపుగా ఉంటుందని, కలలను సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని కన్సల్టెంట్ కో-ఆర్డినేటర్, ప్లేస్‌మెంట్ ప్రొఫెసర్ ఏ నారాయణ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని గిరిజా శంకర కల్యాణమండపంలో ప్రగతి పీయూ కళాశాల ఆధ్వర్యంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే జరిగింది. 2024-25 వార్షిక విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసి మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో సొంతంగా తమ కాళ్లపై నిలబడడం ద్వారా స్థిరపడినట్టు అవుతుందని ఇదే గ్రాడ్యుయేషన్ యొక్క సార్థకత అన్నారు. విద్యార్థులు తమ విద్యాకాలంలో వ్యక్తిత్వాన్ని పెంపొందించుకుంటారన్నారు. విద్యాసంస్థల అధ్యక్షుడు ఎం సతీశ్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు 23ఏళ్ల వచ్చేవరకు విద్యగురించి జవాబ్దారీగా ఉంటారన్నారు. అనంతరం పిల్లలు మంచి ఉద్యోగం లేదా వ్యాపారం, తమకిష్టమైన రంగంలో స్థిరపడి తల్లిదండ్రులకు చేదోడుగా ఉండాలన్నారు. డిగ్రీ అయిన వెంటనే పెళ్లి గురించి ఆలోచించకుండా జీవితంలో స్థిరపడేందుకు కృషి చేయాలన్నారు. బీఎస్‌సీలో 4200 మార్కులకుగాను 4095 మార్కులు సాధించి 97.5 శాతంతో ఉత్తీర్ణులై స్టేట్‌ఫస్ట్‌ర్యాంకు సాధించిన చందన తండ్రిని ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజ్ పాల్గొన్నారు.

నాణ్యమైన పాలతోనే పాడిసంఘం అభివృద్ధి



సమావేశంలో సంఘం అధ్యక్షుడు నారాయణప్ప తదితరులు

● డెయిరీ సంఘం అధ్యక్షుడు నారాయణప్ప

బంగారపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పాలను పాడిరైతులు సరఫరా చేయడం ద్వారానే పాల ఉత్పత్తిదారుల సహకారసంఘాల అభివృద్ధి సాధ్యమని తద్వారా పాడిరైతులకు ఎంతో ప్రయోజనకరమని డైయిరీ సంఘం అధ్యక్షుడు నారాయణప్ప అభిప్రాయపడ్డారు. తాలూకాలోని డీకే హళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని దొడ్డూరు కరపనహళ్ళిలోని పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం 2024-25 వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సంఘం అధ్యక్షుడు నారాయణప్ప అధ్యక్షత వహించి 2024-25 వార్షిక జమా ఖర్చును సభ్యులకు వివరించారు. అదే విధంగా 2025-26 అంచనా బడ్జెట్‌పై చర్చించి ఆమోదించారు. కేఎంఎఫ్ విస్తరణాధికారి బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో తమసంఘం కూడా సభ్యులకు సౌలభ్యాలు కల్పిస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు రంగస్వామి, డైరెక్టర్‌లు వీరప్ప, నాగరాజ్, సురేంద్ర, మునియప్ప, జగదీశ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకీ చెరువు వద్ద చిన్నారులకు చిత్రకళా పోటీలు



విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తున్న ముఖ్యులు

బెంగళూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వినాయకచవితిని పురస్కరించుకుని మల్లేశ్వరం సాంకి చెరువులో గణేశ చిత్రకళాపోటీలకు చిన్నారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. హ్యాంగ్యో ఐస్ క్రీమ్, యాడ్6 అడ్వర్టైజింగ్ సంస్థ సహకారంతో పోటీలు జరిపినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మానవహక్కుల కమిషన్ డీఎస్పీ సుధీర్‌హెగ్డే పాల్గొని చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇటువంటి పోటీలు పిల్లల్లో సృజనాత్మకతను ఉత్తేజింపచేస్తాయన్నారు. మన సంస్కృతి, పరంపరను తెలియచేస్తాయన్నారు. యాడ్6 అడ్వర్టైజింగ్ ముఖ్యులు విజయకళ సుధాకర్ మాట్లాడుతూ చిన్నారుల ప్రతిభ సంతోషం కలిగించిందన్నారు. కార్యక్రమంలో హ్యాంగ్యో ఐస్‌క్రీమ్ సంస్థ మంజునాథ్, టాకింగ్ ప్యారట్స్ సంస్థ సభా హకీంలు పాల్గొన్నారు. విజేత చిన్నారులకు నగదు బహుమతులను ప్రదానం చేశారు.

ఈ-ఖాతా కోసం ప్రత్యేక శిబిరం



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారి

ముళబాగిలు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఇ-ఖాతాలకోసం ప్రత్యేక అభియాన నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా తాలూకాలోని ఆలంగూరు గ్రామంలో రెవెన్యూశాఖ శనివారం ఇ-ఖాతా శిబిరం ఏర్పాటు చేసింది. ఆలంగూరు పరిధిలో 14 గ్రామాలు ఉన్నాయి. మృతి చెందినవారి మరణపత్రాలు, అర్జీ దారుల చిరునామా, ఆధార్, రేషన్‌కార్డు, ఫ్యామిలీ ట్రీ, అఫిడవిట్, ఇటీవలి పొందిన పహణి తదితర వివరాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. అర్జీ సమర్పించిన 15 రోజులలో ప్రమాణపత్రాలను మంజూరు చేయనున్నట్టు గ్రామపాలనాధికారి అఖిలేశ్ తెలిపారు. ఈ శిబిరంలో మృతి చెందినవారిపై ఉన్న రికార్డులను వారి వారసులకు మంజూరు చేసేందుకు దోహదపడనుందని వివరించారు.

రెండు బైకులకు నిప్పంటించిన దుండగులు

రాయచూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎల్‌బీఎస్ నగర్ మక్కా మసీదు సమీపంలో అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని దుండగులు షబ్బీర్ అనే వ్యక్తికి చెందిన రెండు బైకులకు నిప్పంటించి పరారైయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన అనంతరం ఇంటి బయట ఆగి ఉన్న రెండు బైకుల పై పెట్రోలు పోసి నిప్పంటించగా మంటను గమనించిన ఇంటి యజమాని బయటికొచ్చి దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నించగా బైకుల పై పరారైయ్యారు. స్థానికుల సహాయంతో మంటలార్పే ప్రయత్నం చేసేలోగానే రెండు బైకులు పూర్తిగా కాలిపోయినట్లు బాదితుడు శబ్బీర్ అహ్మద్ తెలిపారు. వెంటనే మార్కెట్ యార్డ్ పోలీసులకు ఫోన్ చేయగా సంఘటన స్థళాన్ని పరిశీలించిన ఎస్ఐ బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా బైక్‌కు నిప్పంటించడం అక్కడి నుంచి పరారు కావడం అంతా సమీపంలోని ఒక సీసీ కెమెరాలో నిక్షిప్తమైనట్లు ఆధారాలు దొరికినట్లు పోలీసులు తెలిపారు.



నిప్పంటించేందుకు వచ్చిన దుండగులు



దహనమవుతున్న బైకులు

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న న్యాయాధికారి అశోక్‌కుమార్

మడకశిర టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయాధికారి ఆర్.అశోక్ కుమార్ కోరారు. సెప్టెంబరు 13న స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శనివారం సీఐలు, పోలీసు అధికారులతో న్యాయాధికారి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులను పరిష్కరిస్తామన్నారు. రాజీమార్గమే రాజమార్గం అని, సామరస్యంగా కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.

శనీశ్వర ఆలయంలో విశేష పూజలు



విశేష పూజల్లో ఎమ్మెల్యేలు కృష్ణప్ప, ప్రియకృష్ణ

విజయనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విజయనగర్‌లోని వెస్ట్ ఆఫ్ కార్డ్ మెయిన్‌రోడ్డులోగల శనీశ్వర ఆలయంలో శనివారం విశేషపూజలు నిర్వహించారు. విజయనగర్ ఎమ్మెల్యే కృష్ణప్ప, గోవిందరాజనగర్ ఎమ్మెల్యే ప్రియకృష్ణ పాల్గొన్నారు. ఇదే సందర్భంగా వెస్ట్ ఆఫ్ కార్డ్ రోడ్డు టోల్‌గేట్ నుంచి అత్తిగుప్పె మెట్రో రైల్వే స్టేషన్ వరకు డ్రీమ్‌మోడల్ ప్రాజెక్టులో భాగంగా విజయనగర సామ్రాజ్య శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని, శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని నిర్మించడానికి భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

యూత్‌కాంగ్రెస్ లా విభాగం కార్యదర్శిగా శ్రీనివాస్



శిడ్లఘట్ట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యూత్ కాంగ్రెస్ లా విభాగం కార్యదర్శిగా న్యాయవాది ఎన్ శ్రీనివాస్ నియమితులయ్యారు. శిడ్లఘట్ట తాలూకాలో న్యాయవాది యణ్ణూరు శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉంటున్నారు. ఆయన సేవలను గుర్తించిన జాతీయ యూత్‌కాంగ్రెస్ లా విభాగం అధ్యక్షులు, ఏఐసీసీ సభ్యులు రూపేశ్ ఎస్ చౌదార్య తగిన గుర్తింపు నిచ్చేలా కర్ణాటక రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ లా విభాగం కార్యదర్శిగా శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు శ్రీనివాస్ శనివారం మీడియాతో మాట్లాడుతూ తనకు పార్టీలో సముచిత అవకాశం కల్పించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

బహిష్టులో తీవ్రనొప్పిని నిర్లక్ష్యం చేయరాదు

బెంగళూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బహిష్టులో తీవ్రమైన నొప్పిని నిర్లక్ష్యం చేయరాదని అనుభవజ్ఞులైన వైద్యనిపుణుల సలహాలను పాటించాలని వాసవి ఆసుపత్రి సీనియర్ గైనకాలజిస్ట్ నిశా బుచాడె అభి ప్రాయపడ్డారు. శుక్రవారం ఆమె వర్చువల్‌గా మీడియాతో మాట్లాడారు. ఎండోమెట్రియోసిస్ అనేది మహిళల్లో కనిపించే ఓ జబ్బు అన్నారు. గర్భాశయం లోపలా, బయటా వచ్చే మార్పులలో ఈ సమస్య వస్తుందన్నారు. ఇటీవల 39ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రికి రాగా పరీక్షలలో పోర్టల్‌వేన్ థ్రోంబోసిస్‌గా గుర్తించామన్నారు. పరీక్షలలో ఆమెకు కడుపులోపల రక్తస్రావమైనట్టు గుర్తించామన్నారు. రోబోటిక్ ద్వారా శస్త్రచికిత్స చేశామన్నారు. ప్రస్తుతం ఆమె సంపూర్ణంగా కోలుకున్నారని హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థి ప్రసవం.. నిందితుడి అరెస్టు

బెంగళూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం అనిపించిన యాదగిరి జిల్లా శెహపుర రెసిడెన్షియల్ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిని ప్రసవం వివాదంలో నిందితుడు పరమణ్ణ (30)ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితుడు, హాస్టల్ వార్డెన్, మరో ముగ్గురితో కలిపి శెహపుర పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇతడు బాలికకు సమీప బంధువు కాగా ఇప్పటికే వివాహమైనట్టు పోలీసులు తెలిపారు. బాలికను సదరు వ్యక్తి బెదరించి బయటకు చెబితే హతమారుస్తానని బెదరించినట్టు తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న విద్యార్థిని తెలిపిన మేరకు పరమణ్ణను అరెస్టు చేశామన్నారు.

క్రషర్ యూనిట్లు పరిశీలించిన ఉపలోకాయుక్త

● అక్రమ మైనింగ్‌పై సుమోటో కేసుకు ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఉప లోకాయుక్త వీరప్ప

రాయచూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఫిర్యాదు దారుల నుంచి నేరుగా వినతి పత్రాలు స్వీకరించడంతో పాటు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పరిష్కారం పై తక్షణం అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర ఉప లోకాయుక్త బీ వీరప్ప ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా మూడవ రోజు శనివారం నగర సమీపంలోని ఇండస్ట్రీయల్ ఏరియా మంత్రాలయం రోడ్డులోని స్టోక్ క్రషర్ పాయింట్‌లను ఉప లోకాయుక్త పరిశీలించారు. ఈ సందర్భంగా మిట్టి మల్కాపూర్ క్వారీ ప్రాంతమంతా పరిశీంచారు. విచ్చల విడిగా కంకర పడి ఉండడాన్ని గమనించిన ఉప లోకాయుక్త సుమోటోగా కేసు నమోదు చేయాలంటు సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే సమయంలో క్రషర్ ఫ్యాక్టరీలకు ఇచ్చిన అనుమతి తదితర అంశాలన్నింటిని కులంకశంగా నివేదిక రూపంలో సమర్పించాలంటు ఆదేశించారు. కాగా అదే సమయంలో నగర సమీపం హైదరాబాద్ రోడ్డులోని పరిసరాలను గమనించిన ఉపలోకాయుక్త ఘన వ్యర్థాలను నగరం నుంచి తెచ్చి విచ్చలవిడిగా గుమ్మరించడాన్ని గమనించి సంబంధిత అధికారుల పై కేసు నమోదు చేయాలంటు జిల్లాధికారిని ఆదేశించారు.

రేపు ప్రభుత్వ విశ్రాంత నౌకర్లకు సన్మానం

పావగడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన నౌకర్లను సోమవారం సన్మానించినున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి, ఎమ్మెల్యే వెంకటేశ్, రాష్ట్ర నౌకర్ల సంఘం అధ్యక్షుడు షడక్షరి పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.54	1,629.56
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	47.211	34,083
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	64,566	10,067
నీటి నిల్వ (టీఎంసీలు)	78.27	92.42

మెగా డెయిరీ పనులు వేగవంతం చేయాలి

● 15 ఎకరాల భూమికి పరిహారం చెల్లింపు ● కేఎంఆర్‌సీ నుంచి రూ.80 కోట్ల నిధులు : కేఎంఎఫ్ అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాల్

బళ్లారి/బళ్లారి సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగరం (రాబకోవి) నాలుగు జిల్లాలకు సంబంధించిన పాల సమాఖ్య ఆధ్వర్యంలో మెగా డెయిరీ స్థాపన వేగవంతం చేయాలని కేఎంఎఫ్ అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాల్ అధికారులకు సూచించారు. శనివారం బళ్లారి డీసీ కార్యాలయంలో అధ్యక్షుడు హిట్నాల్ డీసీ, ఇతర అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. బళ్లారి పరిధిలో 15 ఎకరాల భూమిని కొనుగోళ్లకు కేఎంఎప్ రూ. 2 కోట్ల92లక్షలా,1,070 ప్రభుత్వానికి చెల్లించిందని ఆయన తెలిపారు. కేఎంఆర్‌సీ నిధులు రూ. 80 కోట్లతో మెగా డెయిరీ స్థాపనకు పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. మెగా డెయిరీ ఏర్పాటు అయితే నాలుగు జిల్లాల నుంచి రోజూ సుమారు 5 లక్షల లీటర్ల పాల సేకరణ జరుగుతుందని ఆయన అన్నారు. సమావేశంలో సమాఖ్య అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేఎంఎఫ్ అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాల్

సమావేశంలో పలు నిర్ణయాలు

యూనియన్ అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాల్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ఆఫీస్ బేరర్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు. బళ్లారి శివారులోని కొళగల్లులోని రాబకోవి లో మెగా డెయిరీ కోసం జిల్లా యంత్రాంగం 15ఎకరాల భూమిని రిజర్వ్ చేసింది. ఈభూమికి డబ్బు చెల్లించాలని గత బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అదనంగా అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. ప్రభుత్వం శుక్రవారం అనుమతి మంజూరు చేసింది. వచ్చే వారం డబ్బు చెల్లించి సంస్థ కోసం భూమిని స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు. అంతేకాకుండా మెగా డైయిరీకి కొత్త డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను రూపొందించాలని నిర్ణయించారు. డెయిరీకి సంబంధించిన డీపీఆర్‌ను 2021లో రూపొందించారు. అది పాతదని భావించినందున కొత్త డీపీఆర్‌ను రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిసింది. సెప్టెంబరు 17న జరగనున్న హైదరాబాద్ కర్ణాటక విమోచన దినోత్సవానికి కొత్త ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రబకోవి నాయకులను ఆదేశించారని చెబుతున్నారు. దీని ప్రకారం కళ్యాణ్ కర్ణాటక ప్రాంతంలో ఒక డిజైన్‌తో నందిని పార్లర్‌లను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఇది ఉపాధిని సృష్టించడం కూడా లక్ష్యంగా పెట్టుకుంది. 30, 35 కొత్తపార్లర్‌లను తెరవడానికి మునపటి పార్లర్‌లకు కొత్త రూపాన్ని ఇవ్వడానికి బ్రాండింగ్ చేయడానికి ఒకప్రణాళికను సిద్ధం చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.



రాబకోవి ప్రధాన కార్యాలయం



చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

పండుగలను సంప్రదాయంగా జరుపుకోవాలి

● వినాయకుడికి ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారి సిటీ/రూరల్/గాంధీనగర్/కంప్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సంప్రదాయాలు సంస్కృతికి నిలయమైన పండుగలను అందరూ నిర్వహించుకోవాలని సిటీ ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి అన్నారు. గణపతి పండుగను యువత ముందుండి ఆచరించాలన్నారు. సిందిగికాంపౌండులో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి కళాకారులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు.మిత్రమండలి అధ్యక్షుడు గురురాజు, కార్పోరేటర్ నూర్, సిందిగి కాలనీ నివాసులు పాల్గొన్నారు.

అనంత పద్మనాభ గణపతికి పూజలు

బళ్లారి నగరంలోని అనంతపురం రోడ్డులో శ్రీ సర్వసిద్ది వినాయక మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అనంత పద్మనాభ వినాయకుడిని శనివారం సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మాజీ మేయర్ రాజేశ్వరి కాంగ్రెస్ ప్రముఖులు శ్రీధర్ హగరి, గోవిందు, వన్నప్ప తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకట్టుకుంటున్న ఉపాధ్యాయ గణపతి



పాఠశాల నమూనాలో మండపం



ఉపాధ్యాయ గణపతి

కొప్పళ జిల్లా పరిధిలోని తావరగేరేర పట్టణంలో అందుకు భిన్నంగా ఏకంగా ప్రభుత్వ పాఠశాల నమూనాలో వినాయక మంటపం నిర్మించి అందులో చిన్నారులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయుడి వేషంలో దర్శనం ఇస్తుండడం అందరిని ఆకట్టుకుంటోంది

ఎమ్మెల్యే అన్నపూర్ణకు సత్కారం



కంప్లిలో గణపయ్య



ఎమ్మెల్యేకు కమిటీ సభ్యుల సత్కారం

గ్రామాల్లో, పట్టణాల్లో జరుపుకునే ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాల వల్లే ప్రజలు ప్రశాంతమైన జీవనం గడుపుతారని సండూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం అన్నారు. కుడితిని పట్టణంలో వినాయక పండుగ సందర్భంగా రాఘవేంద్ర కాలనీలో రాఘవేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ వారు 18 యేళ్ల వినాయక ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మండపంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

బళ్లారి రాఘవ విగ్రహం

తరలింపులో అపశ్రుతి

● ప్రమాదవశాత్తు రెండు ముక్కలు
● నూతనంగా తయారు చేయిస్తాం : ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరం గడగ చెన్నప్ప సర్కిల్(రాయల్ సర్కిల్) వద్ద ఉన్న బళ్లారి రాఘవ విగ్రహం తరలించే ప్రయత్నంలో అపశ్రుతి చోటు చేసుకుంది. విగ్రహం రెండు ముక్కలు కావడంతో ఆందోళన చోటు చేసుకుంది. రాయల్ సర్కిల్‌లో క్లాక్‌టవర్ ఎత్తు పెంచుతుండడం, రోడ్డు విస్తరణ పనులు చేపడ్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం అక్కడ ఉన్న విగ్రహాన్ని అక్కడ నుంచి తరలించే ప్రయత్నం చేశారు. జేసీబీతో విగ్రహన్ని తొలగించే సమయంలో రెండు ముక్కలుగా పగిలిపోయింది. 2003 ఏడాది రాయల్ సర్కిల్‌లో అప్పుడు బీజేపీ హయాంలో ప్రతిష్ఠించారు. రాఘవ విగ్రహం దెబ్బతినడంతో తెలుగు, కన్నడ కళాకారులు, అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు. రాఘవకళామందిర్ అసోషియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి నూతనంగా రాఘవ విగ్రహన్ని తయారు చేయించి, అదే స్థలంలో ప్రతిష్ఠిస్తామని రాఘువకళామందిర్ అసోషియేషన్‌కు హామీ ఇచ్చారు. కాంస్యం కానీ గ్రానైట్‌తో కానీ సుందరంగా తయారు చేయిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కేఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసుల విస్తరణ

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా పరిధిలోకి వచ్చే ఆదోని, ఆదోని గుండా నడుస్తున్న కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు సర్వీసులను ఆగస్టు 31వ తేదీ నుంచి ఆదోని ఏపీఎస్ఆర్టీసీ బస్టాండు వరకు సర్వీసులను విస్తరించనున్నట్లు కళ్యాణ కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విభాగం కంట్రోలర్ ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, వాయువ్య కర్ణాటక రవాణా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న బస్సులు మంత్రాలయం, రాయచూరు, ఎమ్మిగనూరు, శ్రీశైలం వయా ఆదోని, ఆదోని సర్వీసులను ప్రయాణీకుల అనుకూలం కోసం ఆదోని బస్టాండ్ వరకు విస్తరిస్తామన్నారు. ఆదోని పట్టణంలోని ప్రయాణీకులు దిగేందుకు, ఎక్కేందుకు ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌లతో పాటు అదనంగా పట్టణంలోని నిర్మల్ టాకీసు వద్ద, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద స్టాపింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంచార జాతుల పిల్లలను బడికి పంపాలి

● గుడారాల్లో అవగాహన కల్పించిన అధికారులు



సిండోళ్లు కమ్యూనిటీ వర్గాలతో మాట్లాడుతున్న విద్యాధికారి మిలేష్ బేపూర్

బళ్లారి సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సంచార జాతుల వారు తమ పిల్లలను విధిగా పాఠశాలకు పంపాలని అధికారులు సూచించారు. విజయనగరం జిల్లా హగరి బొమ్మనహళ్ళి క్షేత్ర విద్యా అధికారి మిలేష్ బేపూర్ అతని బృందం ఇక్కడి చింతరపల్లి రోడ్డు పక్కన నివసిస్తున్న సంచార సిండోళ్ళు కమ్యూనిటీ గుడారాలను సందర్శించారు. ఈ సందర్భంగా బీఈఓ 41టెంట్ ఇళ్ళను సందర్శించి ఇళ్లలోని పిల్లల సమాచారం సేకరికరించారు. పిల్లలను పనులకు పంపవద్దని, వారిని విద్యావంతులను చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పిల్లలను పాఠశాలకు పంపకపోతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫీల్డ్ కో ఆర్డినేటర్ ప్రభాకర్, ఫీల్డ్ రిసోర్స్ పర్సన్ పరమేశ్వరయ్య సొప్పిన మఠ, సిఆర్‌పీ గౌరమ్మ, సిండోలా కమ్యూనిటీకి చెందిన నరసింహ తదితరులున్నారు.

2న ప్రణవజ్యోతి మహారథోత్సవం



పూజలందుకుంటున్న ప్రణవజ్యోతి గురువులు

కంప్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని మెట్రి గ్రామంలోని శ్రీ విశ్వారాధ్య గురుకుల మఠం ప్రణవ జ్యోతి మహాక్షేత్రం 47వ వార్షికోత్సవం పురస్కరించుకుని మహారథోత్సవం సెప్టెంబర్ 2న నిర్వహించనున్నారు. మండపంలో 56వ సంవత్సరం సందర్భంగా ఈ ఉత్సవం, శివశరణ మహాయోగి ఎమ్మిగనూరు జడేసిద్దేశ్వర శివయోగి రథోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. పానవోత్సవం, గవోత్సవం, భస్త్రోత్సవం, గీతోత్సవం, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పత్తి పంటకు వలలు తప్పనిసరి : డీడీ

సిరుగుప్ప, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : గులాబి రంగు రోగం సోకితే పత్తి పంటకు వలలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ రైతులకు సూచించారు. శనివారం తాలుకాలోని అచ్చొళ్లి, ఉడదరాళ, రావియాళ ప్రాంతాల్లో పత్తి పంటను పరిశీలించారు. భారీ వర్షాల వలన పత్తి పంటకు గులాబి రంగు సోకినట్లయితే వలలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వలనవ్యవసాయ నిపుణులు డాక్టర్ చంద్రనాయక్ సిరుగుప్ప తాలుకా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజునాథరెడ్డి, అసిస్టెంట్ వ్యవసాయాధికారి బాలాజీనాయక, రైతులు పాల్గొన్నారు.



పత్తిపంటను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి: ఏడీ



ఉత్కంఠంగా సాగిన వాలీబాల్ పోటీలు

కంప్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో విద్యార్థులు ఓడినా గెలిచినా సమానంగా స్వీకరించాలని తాలుకా పంచాయతీ ఏడీ మల్లన్నగౌడ అన్నారు. కంప్లి పట్టణంలో శ్యామ్యాచంద్ పాఠశాల ఆవరణంలో జరిగిన హై స్కూలు క్రీడల్లో శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడలోనూ విద్యార్థులు రాణించాలన్నారు ఈ కార్యక్రమంలో దొడ్డ బసప్ప, హనుమంతప్ప, వీరేష్, రేణుకారాధ్య, రేవణ్ణ, టీఎం బసవరాజు, సర్వేష్ భీమేశ్వర, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మభాషను అందరి దరికి చేర్చిన మహనీయుడు

● తెలుగును గ్రాంథికం నుంచి వ్యవహారికంలోకి అందించిన గిడుగు : రాఘవ కళామందిర్ అధ్యక్షుడు కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కోటేశ్వరరావు, హాజరైన తెలుగు పండితులు

బళ్లారి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):గ్రాంధికంలో ఉన్న తెలుగు భాషను సామాన్య ప్రజలకు సైతం అర్థం అయ్యేలా వ్యవహారికంలోకి తెచ్చిన మహావ్యక్తి గిడుగు రామూర్తి అని రాఘవ కళామందిర్ అధ్యక్షుడు కే. కోటేశ్వరరావు, కే. సుధాకర్ అన్నారు. ప్రపంచ తెలుగు భాషాదినోత్సవాన్ని బళ్లారిలోని రాఘవ కళామందిరంలో శుక్రవారం రాఘవకళామందిర్ అసోషియేషన్, రాష్ట్రేతర తెలుగు సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు తెలుగు వారి ఉట్టిపడేలా కట్టుపంచెలతో సమావేశానికి హాజరయి తెలుగుదనానికి వన్నె తెచ్చారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు, కే. సుధాకర్‌రావు తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. తెలుగును నూతన తరం వారికి వివరిస్తూ కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్నారులు మాతెలుగు తల్లికి పాట పాడి అలరించారు. తెలుగు పండితులు జీఆర్ వెంకటేశులు, సురేంద్రబాబు, ఎం. రామాంజినేయులు. సుప్రసిద్ధ గంటసాల పాటల గాయకుడు వలి అమ్మద్ అమరేంద్ర చౌదరి, నేతిరఘురామరావు, వెంగమాంబ, తదితరలు పాల్గొని తెలుగు భాష గొప్పదనం పై ప్రసంగించారు. వలీ అమ్మద్ గంటసాల తెలుగు పాటలు పాడి అద్భుతంగా అకట్టుకున్నారు. వీరితో పాటు బీమనేని ప్రసాద్, రమణప్ప, తదితర తెలుగు భాషా అభిమానులు హాజరయ్యారు.

ముగ్గురు బాల కార్మికులకు విముక్తి



విలేకరులతో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

బళ్లారి సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త రక్షణ, పునరావాస ప్రచారంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆదేశాల మేరకు కార్మిక శాఖ శనివారం దాడులు నిర్వహించింది. వివిధ శాఖల సహకారంతో టాస్క్ పోర్స్ కమిటీ సండూర్ తాలూకాలోని తోరణగల్లు రైల్వే స్టేషన్, జిందాల్ ఫస్ట్‌గేట్,హొసపేట బైపాస్ రోడ్ వంటి పరిశ్రమలపై ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురు బాల కార్మికులను రక్షించారు. తోరణగల్లులోని నాడకచేరిలో సండూర్ తహసీల్దార్ అధ్యక్షతన టాస్క్ పోర్స్ కమిటీ సమావేశం జరిగింది. బాల కార్మికులపై ఆకస్మిక దాడులు నిర్వహించి పిల్లలను అదుపులోకి తీసుకుని వారి వాంగ్మూలాలను అక్కడికక్కడే నమోదు చేశారు. పిల్లలను విద్యాశాఖ వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దతనంతరం అన్ని వ్యాపార యజమానులకు కరపత్రాలు పోస్టర్లను పంపిణీ చేసి బాలకార్మికుల గురించి అవగాహన కల్పించారు. ఈ కమిటీలో సండూర్ తహసీల్దార్ అనిల్ కుమార్, జిల్లాకార్మిక అధికారి సిద్దప్ప, సండూర్‌లేబర్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్,ఖైనూర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వీరభద్రయ్యహిరేమఠ్, తోరణగల్లు పంచాయితీ అభివృద్ది అధికారి కల్లప్ప, పారిశ్రామిక విస్తరణ అధికారి చైత్ర, జిల్లా బాల కార్మిక ప్రాజెక్టు డైరెక్టర్ మౌనేశ్, రెవెన్యూ అధికారి గణేశ్, కోఆర్డినేటర్ హనుమంతప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టుబడిన 11 అడుగులపాము

హోసూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని గోకుల్‌నగర్‌లోని ఓ ఇంట్లోకి శనివారం పాము ప్రవేశించింది. స్థానికులు గుర్తించి పాములు పట్టే డేవిడ్‌మారన్‌కు సమాచారం ఇచ్చారు. కొద్దిసేపటికి అతను వచ్చి 11 అడుగుల పామును పట్టుకున్నాడు. పాము మెడ ప్రాంతంలో ఇప్పటికే గాయమైందని, హోసూరులోని పశువైద్యశాలలో చికిత్స అందించారు. అనంతరం పామును శానమావు అటవీప్రాంతంలో వదిలారు.

అంజనాద్రికి పోటెత్తిన భక్తులు

కంప్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : కిష్కిందలోని అంజనాద్రికి శనివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో భక్తాదులు ఆలయానికి పోటెత్తారు. కర్ణాటక రాష్ట్రంతో పాటు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి కూడా స్వామి వారిని దర్శించుకోవడానికి కదిలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు భక్తాదులు మాట్లాడుతూ హంపిని దర్శించుకోవడానికి వచ్చిన సమయంలో ఖచ్చితంగా అంజనేయస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.



అలంకరణలో హనుమంతుడు

హోసూరు జోన్

గణనాథుడికి శంఖాలతో పూజలు



వెండికవచధారణలో గణనాథుడు



పూజలో 1008శంఖాలు

హోసూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరం తేరుపేటలోని రాయల్ శ్రీ సుందర నాయక ఆలయంలో వినాయక చవితి నేపథ్యంలో విశేషపూజలు సాగాయి. 1008 శంఖాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత మూలవిరాట్టుకు 108 మూలమంత్రహోమం, కళశాభిషేకం అనంతరం స్వామివారికి వెండికవచం ధరింపచేశారు. శుక్రవారం సాయంత్రం కళశపూజ, వైదిక అర్చన, 1008 శంఖాలతో ప్రత్యేక హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వందలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

సిరుగుప్ప, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని సిరుగుప్ప తాలుకా విద్యా వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ ఖాసీమ్ అన్నారు. శనివారం తాలుకాలోని శిరిగేరి గ్రామంలో ఈద్‌మిలాద్ వేడుకలను పురస్కరించుకుని ముస్లింలు రక్తదాన శిబిర జాగృతి ర్యాలీ చేపట్టారు. ఇంటింటికీ తిరిగి పోస్టర్లను పంపిణీ చేశారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ముస్లిం నాయకులు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మేయర్ సత్య

ఉపాధ్యాయుల సేవలు నిరుపమానం: మేయర్

హోసూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు నిరుపమానమని, మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ఆచరిస్తామని మేయర్ సత్య అన్నారు. శనివారం మున్సిపల్ విద్యాకమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రైవేట్ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటైన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ రేపటితరాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు నిరుపమానమన్నారు. టీచర్ మైండ్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సతీశ్‌కుమార్, ప్రిన్సిపల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మునిరాజ్, మునిసిపల్ ఎడ్యుకేషన్ కమిటీ చైర్మన్ శ్రీధరన్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 45 వార్డులలోని అన్ని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలు అందచేసి సత్కరించారు. సతీశ్‌కుమార్ మాట్లాడుతూ హోసూరు కార్పొరేషన్‌లో ఉపాధ్యాయుల మధ్య ఎలాంటి వివక్షత లేకుండా ఉండాలనే అందరినీ సత్కరిస్తున్నామన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని వినతి

కంప్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, గ్రామాల్లో అధికారులు ఎస్సీ,ఎస్టీ కాలనీలోనే సమావేశాలు ఏర్పాటు చేయాలని, అప్పుడే అక్కడి సమస్యలు వారికి తెలుస్తాయని ఎస్టీ సమాజ నాయకులు నీరుకంటి వీరేష్, హాలిగప్ప, ఎస్సీ సమాజ ప్రముఖులు చెన్నప్ప, రామన్న కోరారు. శనివారం ఎస్సీఎస్టీ సమాజం కులాల వారికి తహసీల్దార్ కార్యాలయంలో కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యాలు అరికట్టాలన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయుసీ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రోత్సాహక ధనం మంజూరు చేయాలని, 2వ వార్డులోని లక్ష్మీటాకీస్ సమీపంలోని అంబేద్కర్ భవన్ చుట్టూ కాంపౌండ్ నిర్మాణం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు గాదెలింగప్ప, రాజేశ్వరి తహసీల్దార్ మంజునాథ నాయక్, ఈఓ శ్రీకుమార్, హాస్టల్ వార్డెన్స్ విరుపాక్షి, అరుణ్, గురు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎస్సీ నాయకులు చెన్నప్ప